సాక్షి
ఆదిలాబాద్
సోమవారం, 20, మే, 2024



ప్రజారోగ్యంతో చెలగాటం

ప్రజారోగ్యంతో కొందరు చెలగాటం ఆడుతున్నారు. వేసవిలో లభించే మామిడి పండ్లను ఇథైల్, ఇథేఫాన్ వంటి ప్రమాదకర రసాయనాలతో మాగబెట్టి విక్రయిస్తున్నారు. 8లో▸



తునికాకు సేకరణ షురూ

బేల అటవీ రేంజ్ పరిధిలోని ఏజెన్సీ ప్రాంతాల్లో తునికాకు సేకరణ ప్రారంభం అయింది. దీంతో వేసవిలో గిరిజనులు ఉపాధి పొందుతారు. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
41.0 /29.0

చాలా వరకు ఎండగా ఉంటుంది. పలుచోట్ల ఆకాశం మేఘావృతమై జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

‘ఉదారి’కి వెన్నెల సాహితీ అవార్డు

ఆదిలాబాద్: జిల్లాకు చెందిన ప్రముఖ కవి ఉదారి నారాయణను వెన్నెల సాహితీ సంగమం అవార్డు వరించింది. ఆయన రచించిన ‘మళ్లీ మనిషిలోకి’ అనే కవితా సంపుటి అవార్డుకు ఎంపికైనట్లు వెన్నెల సాహితీ సంగమం సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు వంగర నరసింహారెడ్డి, పరకపల్లి యాదగిరి పేర్కొన్నారు. అవార్డుతో పాటు రూ.5వేల నగదు కలిపి వచ్చే నెలలో పురస్కారం అందజేయనున్నట్లు తెలిపారు. పురస్కారం వరించడంపై జిల్లాకు చెందిన పలువురు కవులు, రచయితలు ఉదారిని అభినందించారు.

నిరుద్యోగులకు జేసీబీ డ్రైవింగ్ శిక్షణ

ఆదిలాబాద్‌టౌన్: ఉమ్మడి జిల్లాలోని నిరుద్యోగ యువతకు నేషనల్ అకాడమి ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ ద్వారా హైదరాబాద్‌లో జేసీబీ డ్రైవింగ్ శిక్షణతో పాటు ఉపాధి కల్పించనున్నట్లు న్యాక్ సెంటర్ ఇన్‌చార్జి రమేశ్ ప్రకటనలో తెలిపారు. శిక్షణ అనంతరం రూ.25వేల వేతనంతో ఉద్యోగం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి ఉంటుందని తెలిపారు. పదో తరగతి చదివిన వారు అర్హులని, ఈనెల 22వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం 9866565156నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

సుందరయ్య స్ఫూర్తితో ముందుకు సాగాలి



నివాళులర్పిస్తున్న నాయకులు

ఎదులాపురం: పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తితో ముందుకు సాగుతూ హక్కులు సాధించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో ఆదివారం సుందరయ్య 39 వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్లమెంట్‌లో తొలి ప్రతిపక్ష నాయకుడిగా దేశ అభివృద్ధికి నిర్మాణాత్మక పాత్ర పోషించిన సుందరయ్య సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాఘవులు, కిరణ్, పూసం సచిన్, జిల్లా కమిటీ సభ్యులు ఆశన్న, సురేందర్, మంజుల, గంగన్న నాయకులు స్వామి, తదితరులు పాల్గొన్నారు.

నేతకాని కార్పొరేషన్ ఏర్పాటు హర్షణీయం



మాట్లాడుతున్న నర్సయ్య

ఎదులాపురం: నేతకాని కార్పొరేషన్ ఏర్పాటు హర్షణీయమని నేతకాని మహర్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాడి నర్సయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఇచ్చిన హామీ మేరకు ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి నేట్‌కానిని నేతకానిగా మార్పు చేయించడమే కాకుండా, కార్పొరేషన్ ఏర్పాటు చేశారన్నారు. ఈ సందర్భంగా సీఎంతో పాటు మంత్రులకు ధన్యవాదాలు తెలిపారు. ఇందులో రాష్ట్ర నాయకులు భగత్ యాదవ్, గన్‌శ్యామ్ దేవ్ తాడే, రామారావు పాటిల్, జిల్లా ప్రధాన కార్యదర్శి సుదర్శన్ మునేశ్వర్, నాయకులు గంగాధర్ కయాపక్, సిద్ధార్థ్ తెలంగ్, ప్రమోద్ కుమార్ షిండే, పోషన్న తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా నెట్‌బాల్ ఎంపిక పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటూ..

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ఎస్‌ఆర్ డీజీ పాఠశాలలో జిల్లాస్థాయినెట్‌బాల్ మెన్, ఉమెన్ ఎంపిక పోటీలు ఆదివారం ఉత్సాహంగా సాగాయి. పోటీలను పాఠశాల జోనల్ ఇన్‌చార్జి శ్రీనివాస్ క్రీడాకారులను పరిచయం చేసుకొని ప్రారంభించారు. నెట్ బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గౌతం మాట్లాడుతూ.. పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

ప్రైవేట్.. దోపిడీ



పది రోజుల క్రితం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో సంఘ భవన సమీపంలోని ఆస్పత్రిలో ఓ గైనకాలజిస్ట్ ప్రసవం కోసం రూ.80వేల బిల్లు చేయడంతో ఆ పేద కుటుంబం ఏం చేయాలో తెలియక దిక్కుతోచని పరిస్థితి. ఆస్పత్రికి వచ్చినప్పుడు ప్రసవానికి సంబంధించి రూ.30వేల బిల్లు అవుతుందని ఒప్పందం చేసుకున్నారు. ఆ తర్వాత మూడింతలు పెంచి బిల్లు చూపించడంతో ఆమె భర్త అవాక్కయ్యాడు. మహారాష్ట్రకు చెందిన కుటుంబం కావడం, ఇక్కడ తెలిసిన వారు లేకపోవడంతో సొంత గ్రామానికి వెళ్లిన ఆయన వారం తర్వాత తిరిగి వచ్చాడు. స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడంతో కొంత మేర బిల్లు తగ్గించారు.



ఆదిలాబాద్ పట్టణంలోని బస్టాండ్ సమీపంలో గల ఓ ల్యాబ్‌లో ఓ చిన్నారికి కుటుంబ సభ్యులు థైరాయిడ్ టెస్ట్ చేయించారు. అయితే 7.2 ఉన్నట్లు ల్యాబ్ టెక్నీషియన్ రిపోర్టు ఇచ్చాడు. వైద్యుల వద్దకు వెళ్లి మెడిసిన్ వాడుతున్న క్రమంలో అనుమానం వచ్చిన వారు మరోసారి అదే ల్యాబ్‌లో పరీక్షలు చేయించగా 2.7గా నిర్ధారణ అయ్యింది. ఇదేమిటని ప్రశ్నిస్తే తప్పిదం జరిగిందని ఒప్పుకున్నాడు. అర్హత, అనుభవం లేని ల్యాబ్ టెక్నీషియన్‌లతో పరీక్షలు చేయించడంతో రిపోర్టులు తారుమారు అవుతున్నాయి. తనిఖీలు చేయాల్సిన అధికారులు కరువయ్యారు. ఫలితంగా రోగులు, వారి బంధువులు అవస్థలు పడాల్సి వస్తోంది.

- నిబంధనలు పాటించని నర్సింగ్‌హోమ్‌లు
- కానరాని ఫీజుల వివరాల పట్టిక
- అవసరం లేకున్నా వివిధ రకాల పరీక్షలు
- రోగుల నుంచి ఇష్టారాజ్యంగా వసూళ్లు
- నియంత్రించడంలో అధికారులు విఫలం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో పుట్టగొడుగుల్లా ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌లు పుట్టుకొస్తున్నాయి. వీటిని ఏర్పాటు చేసిన వైద్యుల్లో చాలా వరకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న వారే ఉండటం గమనార్హం. లక్షల్లో వేతనాలు తీసుకుంటున్నప్పటికీ వీరు వృత్తికి మాత్రం న్యాయం చేయలేకపోతున్నారనే విమర్శ లున్నాయి. అటు సర్కారు ఆస్పత్రుల్లో విధులు ని ర్వహిస్తూ ప్రైవేట్‌లో ప్రాక్టీస్ చేస్తూ రెండు చేతులా సంపాదిస్తున్నారు. ఇలాంటి వారిపై చర్యలు తీసుకోకపోవడంతో పేదలకు నాణ్యమైన వైద్యం అందడం లేదని తెలుస్తోంది. సర్కారు దవాఖానాల్లో సమయపాలన పాటించకపోవడం, పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడంతో రోగుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్న ఘటనలు అనేకం చోటుచేసుకుంటూనే ఉన్నాయి. నిబంధనలు పాటించాల్సి న నిర్వాహకులు పేషెంట్లను దండుకోవడమే తప్ప సౌకర్యాల కల్పనలో శ్రద్ధ చూపడం లేదని విమర్శలున్నాయి. చిన్నపాటి వైద్యానికి సైతం వేలల్లో బిల్లులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. కొంత మంది బిల్లులు కట్టలేక ఇబ్బందులకు గురవుతున్నారు.

ప్రతీదానికి టెస్టులే..

జిల్లాలోని ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌లు, ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు ఆరోగ్య చట్టాలకు ఎలాంటి విలువనివ్వడం లేదు. ప్రైవేటు మెడికల్ కేర్ ఎస్టాబ్లిష్‌మెంట్ రిజిస్ట్రేషన్ అండ్ రెగ్యులరైజేషన్ యాక్ట్ ప్రకారం వారు అందించే సేవలు, వాటికి వసూలు చేస్తున్న ఫీజులను తెలిపే బోర్డులను తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. కానీ ఎక్కడా ఈ నిబంధనలు పాటించడం లేదు. అయితే వీరికి చట్టాలు చుట్టాలుగా మారుతున్నాయి. చిన్నపాటి జ్వరం వచ్చినా వైద్యులు రక్త, మూత్ర, స్కానింగ్ ఇతర పరీక్షలు నిర్వహించాలని ప్రిస్కిప్షన్ రాస్తున్నారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో రోగుల బంధువులు ఆయా పరీక్షలు చేయిస్తూ జేబులు గుల్ల చేసుకుంటున్నారు. వచ్చిన జబ్బుకు, రాసే మందుల ఖర్చుకు నాలుగింతలు పరీక్షలకు వెచ్చించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నర్సింగ్ హోమ్‌లతో పాటు ఇతర క్లినిక్‌లకు అనుబంధంగా ఇబ్బడిముబ్బడిగా ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్లను ఏర్పాటు చేసి అమాయక ప్రజలను టెస్టుల పేరుతో దోచేస్తున్నారు.

అదనంగా స్కానింగ్ కూడా..

సీజన్‌లో చిన్నపాటి జ్వరంతో వైద్యుల వద్దకు వెళితే మలేరియా, డెంగీ, టైఫాయిడ్, షుగర్, థైరాయిడ్ వంటి పరీక్షలతో పాటు అదనంగా స్కానింగ్ కూడా చేయించుకోవాలని చాలా మంది వైద్యులు రికమండ్ చేస్తూ వాటి నిర్వాహకులను ప్రోత్సహిస్తున్నట్లు తెలుస్తోంది. కొందరు వైద్యులు కమీషన్‌కు కక్కుర్తి పడి తమవద్దకు వచ్చే ప్రతీ పేషెంట్‌కు అన్నిరకాల పరీక్షలు చేయించుకోవాలని పంపిస్తున్నారు. జిల్లాలో వందలాది నర్సింగ్‌హోమ్‌లు, ల్యాబ్‌లకు తోడు వందకు పైగా స్కానింగ్ సెంటర్లు ఉన్నాయి.

కొరవడిన పర్యవేక్షణ..

జిల్లాలోని ప్రైవేట్‌నర్సింగ్‌హోమ్‌లు, స్కానింగ్ సెంటర్లు, ల్యాబ్‌లపై వైద్యశాఖ పర్యవేక్షణ కొరవడింది. ప్రతినెలా సెంటర్లను తనిఖీలు నిర్వహించడంతో పాటు లింగ నిర్ధారణ, డెంగీ, ఇతర పరీక్షల వివరాలు సేకరించి జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారికి నివేదించాలి. నిబంధనలకు విరుద్ధంగా పరీక్షలు నిర్వహిస్తే అనుమతి రద్దు చేయాలి. కానీ కాసులకు కక్కుర్తి పడుతున్న సంబంధిత శాఖ అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదనే ఆరోపణలున్నాయి. ఇదే అదునుగా ప్రైవేట్ సెంటర్ల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు




జిల్లాలోని ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌లు నిబంధనలు అతిక్రమిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవు. ల్యాబ్‌లలో అర్హత గల టెక్నీషియన్‌లను నియమించాలి. అన్నిరకాల అనుమతులు తీసుకున్న తర్వాతే ఆస్పత్రులు, ల్యాబ్‌లను ఏర్పాటు చేయాలి. లేనిపక్షంలో వాటిని సీజ్ చేస్తాం. ఇటీవల జరిగిన సంఘటనకు సంబంధించి ప్రైవేట్ నర్సింగ్‌లో విచారణ చేపట్టాం. కలెక్టర్‌కు రిపోర్టును సమర్పించాం.

– నరేందర్ రాథోడ్, డీఎంహెచ్‌వో

విత్తనం.. భారం

- ఏటా పెరుగుతున్న పత్తి విత్తన ధరలు
- జిల్లాలోని రైతాంగంపై అదనపు భారం



బోథ్: అసలే పెట్టుబడులు పెరిగి రైతులు ఆందోళన చెందుతుంటే పెరిగిన పత్తి విత్తన ధరలు మరింత భారం మోపుతున్నాయి. ఈ ఏడాది పత్తి విత్తన బ్యాగు పై రూ.11 చొప్పున పెంచారు. కిందటేడాది ఒక్కో ప్యాకెట్ ధర రూ.853 ఉండగా.. 2024–25 వ్యవసాయ సీజన్‌కు సంబంధించి పెరిగిన ధరతో కలుపుకొని ధర రూ.864కు చేరింది. ఇందుకు సంబంధించి తాజాగా వ్యవసాయ శాఖ గెజిట్ విడుదల చేసింది. జిల్లాలో దాదాపు 4,16,969 ఎకరాల్లో పత్తి సాగవుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ లెక్కన సుమారు 10,42,422 విత్తన ప్యాకెట్లు అవసరమని అంచనా వేస్తున్నారు. ఒక్కో ప్యాకెట్ ధర రూ.11 చొప్పున పెంచడంతో.. జిల్లా రైతులపై రూ.కోటిన్నరకు పైగా అదనపు భారం పడనుంది. గతేడాది రూ.810 నుంచి రూ.853కు పెంచగా రైతులపై రూ.3 కోట్లకు పైగా భారం పడింది.

పెరుగుతున్న పెట్టుబడులు

ప్రతీ ఏడాది పత్తి విత్తన ప్యాకెట్ల ధరలు పెరుగుతుండటంతో రైతులకు పెట్టుబడి ఖర్చు తడిసి మోపెడవుతోంది. కార్పొరేట్ సీడ్ కంపెనీలు రైతుల నుంచి విత్తనాలు సేకరించి, వాటిని గ్రేడింగ్ చేసి జర్మినేషన్ చెక్ చేసి ప్యాకెట్ల రూపంలో విక్రయిస్తున్నాయి. రైతుల నుంచి సీడ్ కంపెనీలు కొన్న పత్తి విత్తనాలు.. సీడ్ ప్యాకెట్ల రూపంలో తిరిగి రైతులకు చేరేసరికి ధర భారీగా పెరుగుతోంది. ఎకరాకు ఒకటిన్నర లేదా రెండు ప్యాకెట్లు అవసరం కాగా, రైతుల పెట్టుబడి ఖర్చులు బాగా పెరుగుతున్నాయి. పత్తి అధికంగా సాగు చేసే జిల్లా రైతాంగాన్ని విత్తన ధరల పెరుగుదల ఆందోళన కలిగిస్తోంది.

గత నాలుగేళ్ల లెక్కలు పరిశీలిస్తే..

2020–21 ఆర్థిక సంవత్సరంలో సగటున రూ.730గా ఉన్న పత్తి సీడ్ ప్యాకెట్ ధర ఇప్పుడు రూ.864కు చేరింది. అంటే నాలుగేళ్ల వ్యవధిలో రూ.134 మేర ధర పెరిగింది. ప్రతీ సంవత్సరం సగటున రూ.30 చొప్పున విత్తన ప్యాకెట్ల ధరలు పెరిగిపోతున్నాయి. ఏటా విత్తన ధరలు, క్రిమిసంహారక మందులు, యంత్రాల వినియోగ చార్జీలు, కూలీల ధరలు కూడా పెరుగుతుండడంతో రైతులపై ఆర్థికభారం పడుతోంది. ఎకరాకు రెండు ప్యాకెట్ల చొప్పున రైతులు పత్తి విత్తనాలు కొనుగోలు చేస్తారు. వర్షాలు సకాలంలో కురవకపోతే విత్తనాలు మళ్లీ కొనుగోలు చేయాల్సి ఉంటుంది. దీంతో రైతులపై భారం అధికంగా పడుతోంది. విత్తనాలపై సబ్సిడీ ఇవ్వాలని, ధరలను నియంత్రించాలని రైతులు కోరుతున్నారు.

విత్తన ధరలు పెరిగాయిలా..

సంవత్సరం	ధర(రూ.లలో)
2020–21	730
2021–22	767
2022–23	810
2023–24	853
2024–25	864

విత్తన ధరలు తగ్గించాలి



పత్తి విత్తన ధరలను తగ్గిస్తారనుకుంటే పెంచారు. ఇది రైతులకు ఇబ్బందిగా, భారంగా మారింది. ఇప్పటికే పెట్టుబడులు పెరిగిపోయాయి. దీనికితోడు ప్రభుత్వం విత్తనాల ధరలు పెంచడంతో పెట్టుబడి ఇంకా పెరుగుతుంది. అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. విత్తన ధరలు వెంటనే తగ్గించాలి.

– ఇప్ప లక్ష్మణ్, బోథ్

కంపెనీలకు లాభం చేకూర్చేందుకే



విత్తన కంపెనీలకు లాభం చేకూర్చేందుకే ధరలు పెంచుతున్నారు. దీంతో రైతులపై భారం పడుతోంది. ప్రభుత్వం పెంచిన ధరలతో పాటు సబ్సిడీనీ పెంచితేనే రైతులు నష్టపోరు. ఇది ముమ్మాటికి రైతులను మోసం చేయడమే. ఇప్పటికే చాలా పెట్టుబడులు పెరిగిపోయాయి. విత్తన ధరలు తగ్గించాలి.

– ఇదపు రాకేశ్, కనుగుట్ట

రిమ్స్‌లో నీటి సమస్య పరిష్కారానికి చర్యలు



బోరు వేసే స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్‌లో నీటి సమస్య పరిష్కారం కోసం చర్యలు చేపట్టినట్లు డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ తెలిపారు. మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా కాని సమయంలో ఆస్పత్రిలోని పలు వార్డులు, వసతిగృహాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా బోరు వేయించేందుకు చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఈ మేరకు ఆదివారం ఆస్పత్రి ఆవరణలో స్థలాన్ని గుర్తించినట్లు తెలిపారు. ఇందులో ఈఈ చంద్రమోహన్, డిప్యూటీ ఈఈ రమణ, డీఈ ప్రవీణ్, రిమ్స్ హాస్టల్ వార్డెన్, సిబ్బంది ఉన్నారు.

విత్తన కొరత లేకుండా చర్యలు

- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్య



డీలర్లతో సమీక్షిస్తున్న డీఏవో పుల్లయ్య

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో డిమాండ్ గల విత్తన కొరత ఏర్పడకుండా తగు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా వ్యవసాయశాఖ అధికారి పుల్లయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో పట్టణంలోని సీడ్ డీలర్లతో ఆదివారం సమావేశం నిర్వహించారు. డీలర్ల వద్ద అందుబాటులో ఉన్న వివిధ రకాల విత్తనాలు, రోజువారీ గా క్రయ, విక్రయాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కృత్రిమ విత్తన కొరత సృష్టించే డీలర్లను ఉపేక్షించబోమని, అలాంటి వారిపై చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతుల డిమాండ్ మేరకు వారికి అవసరమైన విత్తనాలను మార్కెట్లో అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆయా కంపెనీలకు ఇండెంట్ పంపించి ఎప్పటికప్పుడు తెప్పించాలన్నారు. శాఖాపరంగానూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రైతులకు అవసరమైన విత్తనాలను అందుబాటులో ఉంచేలా చూస్తామన్నారు. జిల్లా రైతులకు మాత్రమే ఆధార్ కార్డు ఆధారంగా విత్తనాలు విక్రయించాలని ఆదేశించారు. మహారాష్ట్ర రైతులకు విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవన్నారు. జూన్ మొదటి వారం వరకు రైతులు విత్తనాలను కొనుగోలు చేసే అవకాశం ఉంటుందని, అప్పటివరకు దుకాణాల్లో సరిపడా విత్తనాలు అందుబాటులో ఉంచాలన్నారు. సమావేశంలో ఏడీఏ రమేశ్, డీలర్లు పాల్గొన్నారు.

ఎయిడ్స్ రోగులను ఆదరించాలి



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న అధికారులు, సిబ్బంది

ఆదిలాబాద్‌టౌన్: ఎయిడ్స్ రోగులను వివక్షకు గురి చేయకుండా ఆదరించాలని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ గజానంద్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ క్యాండిలైట్ మెమోరియల్ దినోత్సవం పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో ఎయిడ్స్ బాధితులకు సంఘీభావంతో పాటు మృతిచెందిన వారికి ఆదివారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏటా మే నెల మూడో ఆదివారం ఎయిడ్స్ మృతులను స్మరిస్తూ కొవ్వొత్తులతో నివాళులర్పించడం జరుగుతుందన్నారు. హెచ్ఐవీ బారిన పడకుండా ప్రతిఒక్కరూ జాగ్రత్త పడాలని సూచించారు. బాధితుల కోసం ప్రభుత్వ పరంగా అనేక సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ పారా మెడికల్ అధికారులు వామన్‌రావు, రమేశ్, ఎల్టీ రమణాచారి, సిబ్బంది సతీశ్, రాజశేఖర్, మజీద్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సరిత, నాగరాజు, సురేఖ పాల్గొన్నారు.

‘ఆమె’లో చైతన్యమేది?

- ఓటేసేందుకు అనాసక్తి
- 2.22 లక్షల మంది మహిళలు పోలింగ్‌కు దూరం
- ఆదిలాబాద్ ‘పార్లమెంట్’ పరిధిలో పరిస్థితి



కైలాస్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల గెలుపోటముల నిర్ణయాత్మకశక్తిగా ఉన్న మహిళా ఓటర్లు తమ ఓటు హక్కును పూర్తిస్థాయిలో వినియోగించుకోలేదు. అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా దూసుకెళ్తున్న అతివలు ఓటరు నమోదులోనూ పైచేయిగా నిలిచారు. అయితే ఓటు హక్కు వినియోగంలో మాత్రం కాస్త వెనుకబడ్డారు. ఈనెల 13న నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా నియోజకవర్గంలో 2,22,793 మంది మహిళలు ఓటు హక్కుకు దూరంగా ఉన్నారు. గతేడాది నవంబర్‌లో నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ మహిళా ఓటర్లది ఇదే పరిస్థితి ఉండటం రాజకీయ, అధికార వర్గాలను విస్మయానికి గురి చేస్తుంది. ఓటర్లుగా నమోదు చేసుకున్న అతివలు పోలింగ్ కేంద్రాలకు రాకపోవడానికి ఎండల తీవ్రత, నా ఒక్క ఓటుతో ఎమవుతుందనే నిర్లిప్త భావన కారణమనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

ఓటర్లుగా అధికం.. ఓటింగ్‌లో వెనుకబాటు

ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లు 8,45,213 మంది ఉన్నారు. ఇందులో పార్లమెంట్ ఎన్నికల్లో 6,22,420 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరి పోలింగ్ 73.64 శా తంగా నమోదైంది. అలాగే పురుష ఓటర్లు 8,04,875 మంది ఓటర్లున్నారు. వీరిలో 5,99,108 మంది ఓటు వేశారు. వీరి పోలింగ్ శాతం 74.43గా నమోదైంది. 2,05,767 మంది పురుష ఓటర్లు ఓటు వేయలేదు. ఏడు నియోజకవర్గాల పరిధిలో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్ల సంఖ్య 40,338 అధికం. ఈ లెక్కన పురుషులతో పోల్చితే మహిళల పోలింగ్ శాతమే అధికంగా నమోదవ్వాలి. కానీ ఎందుకనో మహిళలు ఓటు హక్కు వినియోగంలో పురుషుల కంటే వెనుకబడిపోతున్నారు. ఫలితంగా వారి పోలింగ్ శాతం తక్కువగా నమోదవుతుంది. అత్యధికంగా నిర్మల్ నియోజకవర్గంలో 35,820 మంది మహిళలు ఓటు వినియోగానికి దూరంగా ఉండగా, అత్యల్పంగా బోథ్ నియోజకవర్గంలో 25,790 మంది ఓటు హక్కు వినియోగించుకోలేదు. దాదాపు మిగతా ఐదు నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి.

అసెంబ్లీ ఎన్నికల్లోనూ...

గతేడాది నిర్వహించిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఆదిలాబాద్ జిల్లాలో మహిళా ఓటర్ల పోలింగ్ శాతం పురుషులతో పోల్చితే తక్కువగానే నమోదైంది. ఈ ఎన్నికల్లో 2,19,291 మంది పురుష ఓటర్లకు గాను 1,77,597 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరి పోలింగ్ శాతం 80.96గా నమోదైంది. అలాగే 2,29,074 మంది మహిళా ఓటర్లుండగా 1,80,661 ఓట్లు పోలయ్యాయి. పోలింగ్ శాతం 78.86గా నమోదైంది. ఈ ఎన్నికల్లోనూ 41,694 మంది పురుష ఓటర్లు పోలింగ్‌కు దూరంగా ఉండగా, 48,413 మంది మహిళలు ఓటుహక్కు వినియోగించుకోలేదు. జిల్లాలో మహిళా ఓటర్ల సంఖ్యనే అధికంగా ఉన్నప్పటికి పురుషులతో పోల్చితే 6,798 మంది మహిళలు తమ ఓటు హక్కు వినియోగించుకోకపోవడం గమనార్హం. పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో నమోదైన మహిళల పోలింగ్ శాతం గుర్తించిన అధికారులు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనైనా పోలింగ్ శాతం పెంచేలా చర్యలు తీసుకోవాలని రాజకీయ పార్టీలు కోరుతున్నాయి.

పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని మహిళా ఓటర్ల వివరాలు...

నియోజకవర్గం	మహిళా ఓటర్లు	ఓటు వేసిన వారు	ఓటు వేయనివారు
సిర్పూర్	1,14,547	80,465	34,102
ఆసిఫాబాద్	1,14,404	84,417	29,987
ఖానాపూర్	1,14,825	85,171	29,654
ఆదిలాబాద్	1,25,283	90,272	35,011
బోథ్	1,08,852	83,062	25,790
నిర్మల్	1,36,304	1,00,484	35,820
ముథోల్	1,30,978	98,549	32,429

క్లుప్తంగా

ట్రిపుల్ తలాక్ చెప్పిన వ్యక్తి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: ట్రిపుల్ తలాక్ చెప్పిన పట్టణంలోని కేఆర్‌కే కాలనీకి చెందిన అబ్దుల్ అతీఖ్‌ను జడ్జి ఎదుట హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు మహిళా పోలీసు స్టేషన్ సీఐ జి.శ్రీనివాస్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ట్రిపుల్ తలాక్ చెప్పిన వ్యక్తిపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయగా, ఆదివారం ఆయన్ను జడ్జి ముందు హాజరుపర్చి రిమాండ్‌కు తరలించామన్నారు.

15 మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు


వాహనం తనిఖీ చేస్తున్న ఎస్సై రాము

బోథ్: మద్యం తాగి వాహనాలు నడిపిన 15 మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు ఎస్సై రాము తెలిపారు. మండలంలోని కుచులాపూర్ గ్రామంలోని వేంకటేశ్వర ఆలయం వద్ద ఆదివారం వాహనాలు తనిఖీ నిర్వహించారు. పలువురికి డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు చేయగా మద్యం తాగినట్లు రుజువైంది. వారిపై కేసులు నమోదు చేశామన్నారు. మద్యం తాగి వాహనాలు నడపొద్దన్నారు. మైనర్లకు వాహనాలు యజమానిపై కేసు నమోదు చేస్తామన్నారు.

ఒకరిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: బైక్‌తో ఢీకొన్న ఘటనకు సంబంధించి ఒకరిపై కేసు నమోదైనట్లు టూటౌన్ ఎస్సై లాల్‌సింగ్ నాయక్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గత రెండురోజుల క్రితం పట్టణంలోని కిసాన్‌చౌక్ ప్రాంతంలో అతీష్‌బాబు, కృష్ణ బైక్‌పై ఇంటికి వెళ్తున్నారు. డివైడర్ నుంచి యూటర్న్ తీసుకుంటున్న క్రమంలో మరో బైక్ వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ఘటనలో అతీష్‌బాబు, కృష్ణలకు గాయాలయ్యాయి. వారి ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

భార్యను చంపిన భర్త

ఇచ్చోడ: భార్యని భర్త హత్య చేసిన ఘటన ఇచ్చోడ మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై నరేశ్ కథనం ప్రకారం.. ఇంద్రవెల్లి మండలం సత్యజీగూడకు చెందిన రేణుక (28), ఇచ్చోడ మండలం గాంధీనగర్‌కు చెందిన గుట్ట వెంకట్‌తో 2015లో పెళ్లి జరిగింది. వెంకట్ వ్యవసాయం పని చేసుకుని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పెళ్లయినప్పటి నుంచి మద్యానికి బానిసయ్యాడు. తరచూ భార్యతో గొడవపడేవాడు. శనివారం సాయంత్రం భార్యభర్తల మధ్య గొడవ జరిగింది. మద్యం మత్తులో రేణుకను తాడు బిగించి హత్యచేసి పరారయ్యాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో ఎస్సై నరేశ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇక ‘చేనేత’ ఎన్నికలు

- 12 ఏళ్లకు మోక్షం
- ఉమ్మడి జిల్లాలో రెండు సంఘాలు
- ఎన్నికలకు అధికారుల కసరత్తు

చెన్నూర్: చేనేత సహకార సంఘాల ఎన్నికలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. పన్నెండేళ్ల తర్వాత ఎన్నికలకు మోక్షం లభించింది. ఎన్నికల నిర్వహణ కోసం చేనేత జౌళిశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని రెండు చేనేత సహకార సంఘాలు ఉన్నాయి. ఇందులో మంచిర్యాల జిల్లా చెన్నూర్, కుమురం భీం జిల్లాలోని బెజ్జూర్‌లో సంఘాలు ఉన్నాయి. అధికారులు సభ్యుల జాబితాలు సిద్ధం చేస్తున్నారు. మొత్తం 240 మందికి పై సభ్యులు ఉన్నారు.

ఆరేళ్లుగా పర్సన్ ఇన్‌చార్జిలే..
చేనేత సహకార సంఘాలకు రాష్ట్ర వ్యాప్తంగా ఫిబ్రవరి 11, 2013న ఎన్నికలు జరిగాయి. వీటి గడువు 2018 ఫిబ్రవరి 12న ముగిసింది. పదవీ కాలం ముగిసిన వెంటనే ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా జీవో 568 ప్రకారం పర్సన్ ఇన్‌చార్జీలను నియమించింది. 2018 ఫిబ్రవరి నుంచి 2023 ఆగష్టు వరకు పర్సన్ ఇన్‌చార్జీలతో సహకార సంఘాల్లో కార్యకలాపాలు నిర్వహించారు.


మగ్గం వేస్తున్న చేనేత కార్మికుడు

ఉమ్మడి జిల్లాలో నాడు 8 సంఘాలు..
ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఒకప్పుడు పది చేనేత సహకార సంఘాలతో జిల్లాలో చేనేత వస్త్రాలకు పెట్టింది పేరుగా నిలిచింది. సుమారు 8 వేల కుటుంబాలకు చేనేత సంఘాలపై ఆధారపడి జీవనం సాగించారు. గత ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో సంఘాలు ఢీలా పడ్డాయి. ఆదిలాబాద్, నిర్మల్, లక్సెట్టిపేట, మంచిర్యాల, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్‌లో సంఘాలు మూతపడ్డాయి. ప్రస్తుతం చెన్నూర్, బెజ్జూర్‌లో రెండు చేనేత సహకార సంఘాల్లో కార్మికులు వస్త్ర ఉత్పత్తి చేస్తున్నారు.

చెన్నూర్ సంఘంలోనే అత్యధిక..
చెన్నూర్ చేనేత సహకార సంఘంలో కార్మికులు ఎక్కువ సంఖ్యలో మగ్గాలు నేస్తున్నారు. సుమారు 140 మందికి పైగా కార్మికులు ఉండగా బెజ్జూర్‌లో వంద మంది మాత్రమే కార్మికులు ఉన్నారు.

ప్రభుత్వ ఉత్తర్వులు వచ్చాకే..



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలోని చేనేత సహకార సంఘాల ఓటరు జాబితాలను సిద్ధం చేస్తున్నాం. పర్సన్ ఇన్‌చార్జీల పదవీ కాలం ముగిసింది. కొత్తగా ఎవరికి చార్జీ ఇవ్వలేదు. సంఘాల బలోపేతం కోసం ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. ప్రభుత్వ ఉత్తర్వులు రాగానే ఎన్నికలు నిర్వహిస్తాం.
– చరణ్ చేనేత జౌళిశాఖ కరీంనగర్, ఉమ్మడి ఆదిలాబాద్ ఏడీ

పాటే ప్రాణం.. నటనే జీవనం!

- సంస్కృతి..సంప్రదాయాలకు నిదర్శనం
- రాణిస్తున్న ప్యాదరి మహేందర్


స్టూడియోలో గీతాన్ని ఆలపిస్తున్న మహేందర్


మహేందర్‌ను సన్మానిస్తున్న పాటే మా ప్రాణం సంగీత అకాడమీ సభ్యులు

కుంటాల: పాటకు ప్రాణం పోస్తూ.. నటనలో జీవిస్తూ.. సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ పల్లెప్రజలను చైతన్య పరుస్తున్నారు కుంటాలకు చెందిన ప్యాదరి మహేందర్. ప్యాదరి పోసాని–గజ్జారాం దంపతుల కుమారుడు మహేందర్. ప్రైవేట్ టీచర్‌గా పనిచేస్తూ తీరిక సమయాల్లో పాటలు పాడుతూ.. నటిస్తూ అందరి మన్ననలు పొందుతున్నాడు.

ఇలా మొదలైన ప్రస్థానం..
కుంటాల ఇలవేల్పు శ్రీగజ్జలమ్మదేవి నూతన ఆలయ నిర్మాణం సందర్భంగా ‘కొత్త గుడిని కట్టాం.. గజ్జలమ్మ’! అనే పాటను గాయని మధుప్రియతో కలిసి పాడేందుకు ప్రముఖ సినీ, గేయ రచయిత ఆధ్వర్యంలో పాటల పోటీలు నిర్వహించారు. ఇందులో మహేందర్‌కు మధుప్రియతో కలిసి పాడేందుకు అవకాశం దక్కింది. నటుడు, సినీ, గేయ రచయిత తాటి శివ, కవులు, రచయితలు ముజ్జి రవి, అన్వేష్ సిందె, శ్రీకాంత్, స్నేహితులు, తోటి ఉపాధ్యాయుల సహకారం లభించింది. కులవృత్తులు ఆధ్యాత్మిక, ప్రజల్ని చైతన్యపరుస్తూ సుమారు 55 పైగా పాటలు పాడి ప్రేక్షకుల మనసులను దోచేశారు.


రైతుగోస ఆడియో ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

నటనలో దిట్ట..
తీరిక సమయం దొరికినప్పుడల్లా పాటలు పాడుతూ..బుల్లితెరపై నటిస్తూ తనదైన పాత్ర పోషిస్తున్నాడు మహేందర్. కుంటాల ఇలవేల్పు శ్రీగజలమ్మ దేవి, కల్లూర్ సాయిబాబా, అంబకంటి అంజన్న, కుంటాల ప్రాచీన శ్రీకృష్ణ, కదిలి పాపహరేశ్వర, సిరాల శివాలయాల విశిష్టతను వివరిస్తూ..జై భీమ్ జై భీమ్ అంటూ..గోమాత, ఐక్యత పాటల రూపంలో నటించారు. భైంసాకు చెందిన నిర్మాత కొత్తూరు శంకర్, రచయిత గంధం శ్రీనివాస్, హీరో గంధం స్నేహిత్ నటించిన ప్రేమలోల్లి సినిమాలో లవ్ ఫెయిల్యూర్ పాట ద్వారా తొలిసారి వెండితెరకు పరిచయమయ్యాడు. బతుకమ్మ పండుగ, జానపద పాటలను పాడుతూ నటిస్తూ అందరినీ మెప్పించి ఒప్పిస్తున్నాడు.

అందరి సహకారంతో..
తొలిసారిగా గజ్జలమ్మ పాట పాడే అవకాశం మధుప్రియతో కలిసి దక్కింది. అప్పటినుంచి పాటలు పాడడంతో పాటు నటనపై అభిరుచి పెరిగింది. అందరి సహకారం లభించింది. పాట, నటనను అందరూ ఆదరించడం సంతోషంగా ఉంది.
– ప్యాదరి మహేందర్

చికిత్సపొందుతూ ఒకరి మృతి

ఆదిలాబాద్‌టౌన్: మహారాష్ట్రలోని కిన్వట్ తాలుకా అంద్‌బోరి గ్రామానికి చెందిన రాథోడ్ తులసీరాం నాయక్ రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. టూటౌన్ ఎస్సై లాల్‌సింగ్ నాయక్ కథనం ప్రకారం.. తులసీరాం పెళ్లి కోసం పలువురు అమ్మాయిలను చూసినప్పటికీ పెళ్లి కావడం లేదని మానసిక వేదనకు గురయ్యాడు. ఈనెల 16న తన ఇంటి వద్ద పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందినట్లు వివరించాడు.

డ్రైవర్..

ఆదిలాబాద్‌టౌన్: ఇటీవల మహారాష్ట్రలోని పిప్పల్‌కోటి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలైన లారీడ్రైవర్ చిన్నరామయ్య (72) రిమ్స్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. టూటౌన్ ఎస్సై లాల్‌సింగ్ నాయక్ కథనం ప్రకారం..గత నాలుగు రోజుల క్రితం పిప్పల్‌కోటి వద్ద రెండు లారీలు ఢీకొన్నాయి. గాయాల పాలైన చిన్నరామయ్యను చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. కాగా ఈయన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్నమయ్య జిల్లాలోని రాంపూర్ మండలం పలానపూరి పల్లెకు చెందినవాడని తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

పిచ్చికుక్కదాడిలో పలువురికి గాయాలు

భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్ గ్రామంలో ఆదివారం పిచ్చికుక్క దాడిలో పలువురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రాజవ్వ, లక్ష్మణ్, లక్కీ, జనార్దన్‌కు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం భైంసా ఏరియాస్పత్రికి తరలించారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

కౌటాల/కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్ సమీపంలో రైలు కిందపడి గుర్తుతెలియని యువకుడు (28) ఆదివారం ఆత్మహత్య చేసుకున్నట్లు కాగజ్‌నగర్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ సురేష్‌గౌడ్ తెలిపారు. మృతుడి ఎడమ చేతి పై కుంత అని, కుడి చేతి భుజం పై త్రిశూల్ సింబల్ పచ్చబొట్టు ఉందని పేర్కొన్నారు.
మృతుడు షర్టు ధరించలేదని, బూడిద కలర్ ప్యాంటు ధరించి ఉన్నాడని తెలిపారు. మృతదేహాన్ని సిర్పూర్(టి)లోని ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలోని మార్చురీ గదిలో భద్రపరిచినట్లు పేర్కొన్నారు. ఇతని వివరాలు తెలిస్తే 8712658596, 8712658605 సెల్‌నంబర్లలో సంప్రదించాలని కోరారు.

అదనపు కట్నం కోసం వేధించిన ఐదుగురిపై కేసు

నెన్నెల: అదనపు కట్నం కోసం వేధించిన భర్త, మామ, అత్తతోపాటు ఆడబిడ్డ, ఆమె భర్తపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పెద్దపల్లి జిల్లా గుర్రంపల్లికి చెందిన నాగుల మల్యాల రాజు, నెన్నెల మండల కేంద్రానికి చెందిన మౌనికతో గతేడాది జూన్ 14న వివాహం జరిగింది. పెళ్లి ఖర్చు కింద రూ.3 లక్షలు నగదు, తులం బంగారాన్ని మౌనిక తల్లిదండ్రులు ఇచ్చారు. సుమారు 3 నెలల పాటు సజావుగా సాగిన వారి కాపురంలో గొడవలు మొదలయ్యాయి. అదనపు కట్నం, మరో రూ.3 లక్షలు తీసుకురావాలంటూ భర్త రాజు, అత్త నాగుల మల్యాల అమ్మాయి, మామ ఆనందంలతోపాటు ఆడబిడ్డ బ్రమ్మోజు స్వప్న, ఆమె భర్త రవిబాబు వేధించసాగారు. పెళ్లయిన 15 రోజుల నుంచే అదనపు కట్నం తేవాలని భర్త రాజు ఇంట్లో తలుపులు పెట్టి చిత్రహింసలు పెట్టేవాడని పేర్కొన్నాడు. బాధితురాలు మౌనిక ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

ప్రజారోగ్యంతో చెలగాటం


సీజ్ చేసిన మామిడిపండ్ల లారీలతో అధికారులు

- రసాయనాలతో మామిడి పండ్లుగా మార్చుతున్న వ్యాపారులు
- నిబంధనలకు విరుద్ధంగా తీసుకెళ్తున్న ఐదు లారీలు సీజ్

ఆదిలాబాద్‌టౌన్: ప్రజల ఆరోగ్యంతో కొందరు వ్యాపారులు చెలగాటం ఆడుతున్నారు. వేసవి సీజన్‌లో లభించే మామిడి పండ్లను ఇథైల్, ఇథేఫాన్ ప్రమాదకర రసాయనాలతో మాగబెట్టి విక్రయిస్తున్నారు. ఎక్కువ మోతాదులో రసాయనాలు వేసి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్న ఐదు లారీల మామిడి పండ్లను ఫుడ్ సేఫ్టీ అధికారులు సీజ్ చేశారు. ముందస్తు సమాచారంతో ఫుడ్ సేఫ్టీ జోనల్ ఇన్‌చార్జి అమృతశ్రీ శనివారం మావల సమీపంలోని దేవాపూర్ చెక్ పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేయగా నిబంధనలకు విరుద్ధంగా మామిడి పండ్లను తరలిస్తున్న లారీలను స్వాధీనం చేసుకున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా..
ఖమ్మం, వరంగల్, జగిత్యాల, బాటసింగారం తదితర జిల్లాల నుంచి ఆదిలాబాద్ జిల్లా మీదుగా హర్యానా, ఇతర ప్రాంతాలకు మామిడి పండ్లు తరలిస్తున్నారు. ఒక ప్యాకెట్ 10 కిలోల మామిడి పండ్లకు తగలకుండా వాటిని ఉంచాల్సి ఉంటుంది. అయితే ఈ పట్టుబడ్డ లారీల్లో ఒక్కొక్క డబ్బాలో 5 నుంచి 6 ప్రమాదకర రసాయనాలను ఉంచారు. దీంతో చిన్నపిల్లలతోపాటు పెద్దలకు అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని వైద్యాధికారులు చెబుతున్నారు. గత నెలరోజులుగా ఆదిలాబాద్‌తోపాటు ఇతర జిల్లాల్లో మామిడి పండ్ల విక్రయాలు ఎక్కువగా జరుగుతున్న దృష్ట్యా వినియోగదారుల ఫోరం సభ్యులు ఫుడ్ సేఫ్టీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వారు వాహనాల తనిఖీలు చేపట్టారు.

జిల్లాలోనూ ఇదే తంతు..
జిల్లాలో ఫ్రూట్స్ వ్యాపారులు కొందరు నిబంధనలకు విరుద్ధంగా రసాయనాలను వాడుతూ విక్రయిస్తున్నారు. సంబంధిత అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరించడంతో పండ్లను కొనుగోలు చేస్తున్న జనాలు అనారోగ్యం బారిన పడుతున్నారు. ఆదిలాబాద్ సమీపంలోని గోదాముల్లో పండ్లను నిల్వ ఉంచుతున్నారు. ఇతర జిల్లాల నుంచి కాయలుగా తీసుకొచ్చి వారి అవసరం మేరకు రసాయనాలను వాడి పండ్లుగా మార్చుతున్నారు. మామిడి, అరటి, సపోటాలు, బొప్పాయి తదితర పండ్లపై రసాయనాలను వినియోగిస్తున్నారు. తనిఖీలు చేసిన ఫుడ్ సేఫ్టీ అధికారులు కేవలం వాహనాలు మాత్రమే సీజ్ చేయగా, పట్టణంలోని ఏ ఒక్క ఫ్రూట్ షాపులు, గోదాములను తనిఖీలు చేపట్టలేదు. ఒకవేళ తనిఖీలు జరిపితే రసాయనాలు బయటపడేవని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఆరోగ్యం కోసం జనాలు పండ్లను కొనుగోలు చేస్తుంటే రసాయనాల కారణంగా అనారోగ్యం బారిన పడాల్సిన దుస్థితి నెలకొంది. ఇదిలా ఉండగా, వివిధ కారణాలతో అనారోగ్యం బారిన పడ్డ రోగులను పరామర్శించేందుకు వెళ్లేవారు సైతం వారికి పండ్లను తీసుకెళ్తుండటం గమనార్హం.

మద్యం మత్తులో బీరు సీసాతో ఒకరిపై దాడి

- రిమ్స్‌కు తరలింపు
- కేసు నమోదు

పెంబి: మద్యం మత్తులో బీరు సీసాతో ఒకరిపై దాడి చేసిన ఘటన మండల కేంద్రంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై శంకర్ కథనం ప్రకారం.. ఉట్నూర్‌లోని రాజంపేటకు చెందిన ఆత్రం సోనేరావు శనివారం పెంబి మండలం పస్పుల గ్రామంలో తన బంధువుల పెళ్లికి వచ్చాడు. అనంతరం తన స్నేహితులు జంగు, కైలాష్‌తో కలిసి వైన్స్ షాపు వద్దకు వచ్చి మద్యం తాగుతున్నారు. అక్కడే ఉన్న పెంబికి చెందిన పాకల సంతోష్ మద్యం మత్తులో సోనేరావు జేబులో చేయి పెట్టాడు. చేయి ఎందుకు పెట్టావంటూ వారి మధ్య వాగ్వాదం జరిగింది. సంతోష్ పక్కనే ఉన్న బీరు సీసాను పగులగొట్టి సోనేరావు మెడపై పొడిచాడు. తీవ్ర రక్తస్రావమైన అతన్ని స్నేహితులు పీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఖానాపూర్ ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి ఆదిలాబాద్ రిమ్స్‌కు పంపించారు. సోనేరావు బంధువు ఆత్రం వసంత్‌రావు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, సంతోష్‌ని అదుపులో తీసుకున్నామని ఎస్సై తెలిపారు.


పెంబి పీహెచ్‌సీలో ఆత్రం సోనేరావు

చేపలవేటకు వెళ్లి ఒకరు మృతి

పెంబి: చేపలవేటకు వెళ్లి ఒకరు మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మండలంలోని ఇటిక్యాల్ గ్రామానికి చెందిన చుంచు లస్మయ్య (41) శనివారం సాయంత్రం చేపల వేటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. ఆచూకీ కోసం ఎంత వెతికిన దొరకలేదు. ఆదివారం ఉదయం గ్రామ సమీపంలోని కుంటలో మృతి చెంది ఉండడంతో స్థానికులు కుటుంబీకులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకున్నారు. ఎస్సై శంకర్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడి కుమారుడు శంకర్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గాంధీ విగ్రహం ధ్వంసం

తాంసి: భీంపూర్ మండలం నిపాని గ్రామంలో గాంధీ విగ్రహాన్ని శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. గ్రామానికి చెందిన వ్యక్తి కారు అద్దాలను పగులగొట్టారు. ధ్వంసమైన విగ్రహాన్ని ఆదివారం గ్రామస్తులు గమనించి భీంపూర్ పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై ప్రదీప్ కుమార్ సిబ్బందితో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


ధ్వంసమైన గాంధీ విగ్రహం

వడదెబ్బతో ఉపాధి కూలీ మృతి

ఖానాపూర్: మండలంలోని బీర్నంది గ్రామానికి చెందిన ఉపాధి కూలీ జాడి గంగవ్వ(43) వడదెబ్బతో మృతిచెందింది. ఈనెల 15న వడదెబ్బతో అస్వస్థతకు గురికాగా, ఆర్‌ఎంపీ వద్ద ప్రథమ చికిత్స పొందింది. గురువారం ఖానాపూర్, శుక్రవారం నిర్మల్ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంది. శనివారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. మృతురాలికి భర్త లింగన్న, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు.


జాడి గంగవ్వ(ఫైల్)


రామకృష్ణాపూర్: సీవీ రామన్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు



తాంసి: కప్పర్ల జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు


మంచిర్యాలటౌన్: ఎంవీఎస్ డిగ్రీ డిగ్రీ పూర్వ విద్యార్థులు

అ‘పూర్వ’ సమ్మేళనం


జైనథ్: గురువులతో పూర్వ విద్యార్థులు

రామకృష్ణాపూర్: పట్టణంలోని సీవీ రామన్ ఉన్నత పాఠశాలకు చెందిన 1998–99 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. 25 ఏళ్ల అనంతరం సుమారు 150 మంది పాఠశాలలో కలుసుకుని సిల్వర్ జూబ్లీ వేడుకలను జరుపుకున్నారు. ఆత్మీయ ఆలింగనం అనంతరం యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తీపిగుర్తులను నెమెరువేసుకున్నారు. రోజంతా సంతోషంగా గడిపారు. అప్పటి పాఠశాల కరస్పాండెంట్ గురిజాల రవీందర్‌రావు, హెచ్‌ఎంలు సురేందర్‌రావు, పెద్దపెల్లి ఉప్పలయ్య, చిరంజీవి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు. గురిజాల రవీందర్‌రావు రచించిన బొగ్గరవ్వలు పుస్తకాన్ని కార్యక్రమంలో ఆవిష్కరించారు.

ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో..
మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ మైక్రో బయాలజీ పూర్వ విద్యార్థులు 20 ఏళ్ల తర్వాత ఆదివారం కలుసుకున్నారు. విద్యార్థులంతా ఒకచోట చేరి సందడి చేశారు. చదువుకునే రోజుల్లో జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. సహ విద్యార్థి జిల్లా రచయితల వ్యవస్థాపక అధ్యక్షుడు బొడ్డు మహేందర్‌ను సన్మానించారు. రాజేశ్, మల్లాగౌడ్, రమేశ్, నరేశ్, స్రవంతి, స్వప్న, హారిక, అనిత, సురేశ్ పాల్గొన్నారు.

కప్పర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో..
తాంసి: మండలంలోని కప్పర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1989–90 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. 34 ఏళ్ల అనంతరం దాదాపు 50మంది పాఠశాలలో కలుసుకుని సందడి చేశారు. ఒకరికొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. రోజంతా సంతోషంగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను నారాయణ రెడ్డి, రత్నాకర్‌రెడ్డి, సుదర్శన్ తదితరులను సన్మానించారు.


కుభీర్ ఉన్నత పాఠశాలలో..

జైనథ్‌లో..
జైనథ్: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2007–08 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఒకచోట చేరారు. పాఠశాలలో పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు.

కుభీర్‌లో..
కుభీర్: కుభీర్ ఉన్నత పాఠశాలలో 2004–05 బ్యాచ్ పూర్వ విద్యార్థులు కలుసుకున్నారు. పాత జ్ఞాపకాలు గుర్తుచేసుకున్నారు. రోజంతా సంతోషంగా గడిపారు. మేమున్నాం ట్రస్ట్ ద్వారా విరాళాలు సేకరించి తోటివారిని ఆదుకుంటామన్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు.